కోటిలింగాలు

విద్వాన్ సూరిగుచ్చి కృష్ణమూర్తిగారు

"పత్రికకు పంపేవి ముందుగా పంపాలంటారుగదా దీపావళిమరి మొన్ననేగాజరిగింది. అప్పుడే మరి ఆరోజునజరిగిన సంగతులెలాపంపిందండీ! చిత్రంగాఉంది గాని."

"సరీగ్గా యీయేడు దీపావళికిజరిగిందేనా యేమిటి పంపాలిసింది? నిరుడు జరిగిందై ఉండగూడదూ ఆసంగతి?"

"అయితే గాంధీగారూ మాలాళ్లూఅని యేమో రాశిందిగదూ. అది నిరుడుజరిగిందేమిటి?. పాపం! ఏదో కప్పెడదామనుకున్నారుగాని. అందుకోసమే అసలుపత్రికల్లో రాసేవన్నీ అబద్ధాలే."

"ఊరుకుందూ. నీకబుర్లకేంలే, చదువురానివాళ్ల కల్లానే ఉంటుంది."

"మఱిబంగారం తొక్కగూడదంటారుగదా! ఆవిడకాళ్లకు పట్టీలే బంగారపువి పెట్టుకుందేం అంతచదువుకునికూడాను."

"చదువుకున్నవాళ్లు పెట్టుకోవచ్చు. అందుకోసమే మొన్నశాస్త్రుల్లగారికాలికి బంగారపుకడియం తొడిగారు మహాపండితులంతాగలిసి."

"అయితే పాపమేఉండదన్నమాట అలా బంగారంతొక్కినందుకు శాస్త్రుల్లగార్లయితేనూ, చదువుకుంటేనూ."

"అహా! నిజమే. సావిత్రిపాతివ్రత్యం యముణ్ణి హతమార్చినట్లుగా ఈచదువుకూడా పాపాన్నినాశనం చేస్తుంది. నీకేంతెలును చదువుకోనిదానివి. అందుకోసమే నాలాటిమొగుళ్లుండాలి అన్నీచెప్పేందుకు."

"సరే మొగుళ్లకేంగానీండి మీస్కూల్లో పెద్దమ్మగారువస్తే మీరు లేస్తారుగదా! అచ్చుయింట్లో మొగుళ్లువస్తే పెళ్లాలులేచినట్లు అనిమీకుజ్ఞాపకం వస్తుందటండీ. అయినా కాస్త తమపాకు నేవంటింట్లోంచి వస్తాను మీస్కూలావిడేఅనుకోండి ఒక్కమాటు లేద్దురూ. నేఎవళ్లతోటీచెప్పను. నవ్వనుకూడానవ్వను. ఒట్టు."

"నోరుమూద్దూ. ఆవిడవస్తే తలిమ్మామొగమేష్టర్లు లేస్తారుగాని నేలేస్తేగదా అసలు."

"అబ్బో గొప్ప. ఎవరికోసంలేస్తారు. నేలష్కసార్లుచూశాను. మీతో రానీకపోతేమాత్రం అంతస్కూల్లోకి రాలేననుకున్నారా ఆపాటి."

"వాళ్ల ప్రభావతితో చెప్తానుఉండు ఈసారినిన్ను తీసుకురావద్దని. ఇదో ఆటగాఉంది. మహా నీవు ఊపుకుంటూ రావడమూను, వాళ్లంతా నవ్వుతూ నన్నుచూస్తూండడమూను. అసలు ఈమాటు నువ్వువస్తే నీతోమాట్లాడను. వేళాకోళం అనుకున్నావుగాబోలు."

"అబ్బో యిదంతాకోపమేనుటండీ. పాపంమాట్లాడరు? పోనీగానీండి మాటవరసకు అడుగుతున్నాను. మొన్నఅక్కడ పెళ్లికెళ్లాంగదా. అన్నేళ్లు వచ్చాక ఆవిడకుపెళ్లేమిటండీ. మరివిచిత్రంగాకపోతే. మీస్కూళ్లూ మీతరహాలూ సినిమాలాఉందినాకు. అయినా ఇప్పుడుపెళ్లేమిటి. ఏంచేస్తుంది కాపరం. పోనీ ఆవిడకు పిల్లలున్నారటండి యీవరకు."

"ఛీ ఊరుకో. ఆవిడవింటే జైల్లోకూడా పెట్టిస్తుంది. ఇప్పుడుపెళ్లి అంటె ఇదివరకే పిల్లలుంటారా? మీవాళ్లకెవరికేనా అలాఉన్నారా పిల్లలు?"

"సరి మావాళ్లు ఇల్లా పెళ్లిచేసుకుంటే ఉండేఉందురేమో పిల్లలు."

"నీవు పల్లెటూరిదానివిగనక నీకుతెలీదుపాపం. అసలు పెళ్లంటే ఏమిటోనీకు అర్థంకాలేదన్నమాట. అడదానికీ మొగాడికీ జ్ఞానంవచ్చాక అంటే పేద్దపరీక్షలిచ్చాక పెళ్లిగావడంలో అందం ఉంది. ఇద్దరూ ముందు చూసుకుంటారు. ఒకరిమంచిచెడ్డ లోకరికి తెలుస్తుంది. అప్పుడు ఇద్దరికీ యిష్టంగలుగుతుంది. వెంటనే అట్టేడబ్బుఖర్చులేకండా నలుగురు స్నేహితులకీ యింతకాఫీయిస్తారు, పెళ్లయిందంటారు. మర్నాడు పేపర్లో ఇద్దరిపేర్లూ అచ్చుపడతవి-చూడు ఎంతబావుందో. మరి నీకూ నాకూ పెళ్లి

యిలాఅయిందా? ముందుమఃద్దరం ఎరగము. నేను కుంటివాణ్ణో నీవుగుడ్డిదానివో కూడా తెలీదుగదా. ఇష్టం అసలేలేదు. నీవంటే యిప్పటికీ నాకిష్టంలేదు. ఏదో మాఅమ్మావాళ్లూ కోప్పడతారనే భయంతప్ప. మనపేర్లు చస్తే పేపర్లోపడవు. ఎందుకిల్లాంటిపెళ్లి. ఎబ్బే వట్టిడబ్బుదండుగ."

"అయితే జ్ఞానంఅంటె పెద్దపరీక్షలియ్యాడమనీ, తమగర్భాల శుభంకోరే తల్లిదండ్రులుచూచి చేసేకంటే తామేచూసుకోవాలనీ, పేపర్లో పేర్లుపడడమే మంగళసూత్రం మెళ్లోపడడమనీ మీచదువులన్నమాట. ఏమో నే చదువుకోనిదాన్ని నాకేంతెలుస్తుంది గనక. అయితే మీకు కవిత్వమూ, సంస్కృతమూ వచ్చుగదా యివన్నిపెట్టి మంత్రాలు రాయరాదూ డబ్బేనావస్తుందేమోకాస్త. ఎల్లాగూవాళ్లిచ్చే జీతం చాలడంలేదుగా మనకు."

"చిత్తం, కానీండి, తమరు క్రొంచెంసలహాలు కట్టిపెట్టి లోపలకు దయచెయ్యండి ఎవళ్లోవస్తున్నారు."

"పోతానులెండి. ఇక్కడకూచుంటే ఆకాఫీగిన్నెలన్నీ ఎవళ్లుకడుక్కతారు. ఆబోడిదానీది అప్పుడే మానుకుందాయె. అయితే ఆడాళ్లుకూడా మొగాళ్లతోకలిసి మాట్లాడొచ్చు, వాళ్లతో చేతులూకలపవచ్చు అంటారుగా మరి నన్ను లోపలికి పొమ్మంటారేం? అయినా ఎవళ్లిదాకావస్తేగాని యిల్లాంటివి తెలియవులెండి, కబుర్లు ఎన్నిచెప్పితేఏం ఉత్తవి."

"పోనీ వాళ్లతో చేతులు కలపాలంటేకూచో, నాదేంపోయింది."

"నేచదువుకున్నదాన్నయితేగా కలిపేందుకు. ఊరికే మాటవరస కడుగుతున్నాను—కోటిలింగాలకెప్పుడూపోవడం."

"అబ్బ! ఎవళ్లోవస్తూన్నారంటే అదేగోల కోటిలింగాలూ నూరులింగాలూను."

"మీకస్తమానమూ వస్తూనేఉంటూరు ఎవరో ఒకరు. తొందరగా పంపేయండివాళ్లని ఊరికేకూచో పెట్టుకోక."

అసలు దీనిఅల్లరీ, కుంటిప్రశ్నలూ విసిగించడమూ నాకు తెలునుగనకే బదిలీఅవుతుంటే రాజమండ్రీ తీసుకువెళ్లనన్నాను. వాళ్లనాన్నావాళ్ల దగ్గిరికి పంపుతానంటే పోననిఏడ్చింది. పోనీ చిన్నపిల్లగదా నేనంటే అంతప్రేమ తనకు, ఎందుకుఏడిపించడం, అంతఒకవేళ ఏడిపించి యిప్పుడుపంపినా నాలుగోనాటికి ఎల్లాగూ గోలపెట్టివస్తుంది. అనవసరం రైలు కర్చుఅని తీసుకొచ్చాను. చూశారుగదూ దానిప్రశ్నలు. అల్లా సమాధానంచెప్పలేకండా వేస్తుంది. పోనీ దానికితెలిసి తెలివితేటల్తోవేస్తుందేమో అనుకుంటేమళ్లీ అదేంలేదు. వట్టి ఊరికే అనుకోకుండా వేస్తుంది. తనకూతెలీవు అవి అంతచిక్కుప్రశ్నలని పైగా- నేచెప్పిన గుడ్డిసమాధానాలకు మూడువంతులు తృప్తిపడుతుంది. అదీ ఇదీ అక్కడికీ యిక్కడికీఅని విసిగిస్తే వీల్లేక ఓదానికోటి చూపెట్టినా నిజమేఅనుకొని సంతోషిస్తుందిపాపం. ఊరికేమాయిద్దరికీ పాతచుట్టరికంకాస్తేనా లేకపోయినా ఆపిల్లఅంటే ఎందుకోనాకు అపరిమితప్రేమ- నాదగ్గిర చిన్నపిల్లలా అవీయివీకావాలని యేడుస్తుంది. దాన్నిసంతోషపరచడమే నాకుఆనందం, వాళ్లనాన్నా వాళ్లనికూడా అడగదు. వాళ్లకోసం ఒక్కనిమిషమేనా విచారించదు. మళ్లీతను చిన్నపిల్లేఅయినా, ఎవరుచెప్పారో మరిఎల్లాతెలుసో ఏమో తనకు తండ్రిఅయినా తల్లిఅయినా అన్నఅయినా నేనే అనీ తనుఎల్లామాట్లాడినా ఎల్లాచేసినా నాకు ఇష్టంగాఉంటుందనీ ఓగట్టినమ్మకంపాపం- అల్లాంటిపిల్లను ఏమనికోప్పడను.

భార్యాభర్తలు జీవించేది ఒకరికోసం ఒకరుగాకపోతే జన్మఎందుకు? నాశరీరం, నాఅందం, నాఐశ్వర్యం, నామంచీ అన్నీతనవి. తనకోసం తననుసంతోషపరచేందుకు నేనుబతుకుతున్నానని నానిశ్చయం- అందుకోసమే వీలైనంతవరకూ తనుఏంకావాలంటే అదినెరవేరుస్తాను. అయితే నాకు సిగ్గుఎక్కువ. అందుకోసం బహిరంగంగా ఏమీచెయ్యను తనకై. తనకూ అంతే-

ఈఊరు తలిమ్మాఊళ్లకు మల్లేగాదు. ఎన్నోచూడాలసినవి ఉన్నవి. మగవాణ్ణినాకేంగనక ఎప్పుడం

టేఅప్పుడే చూడవచ్చు. అయితే తనకూచూపాలిగా. ఎల్లాతీసుగెళ్లను?. నాకూకొత్తేయీవూరు. నేనిలా స్కూల్లోకి పోగానే తనుపక్కింటికిపోయి అన్నీఅడుగుతూండేది, వాళ్లప్రభావతితో మూడునాలుగు సార్లు స్కూలుకూడావచ్చింది. అయితే తెలివితేటలేమిటంటే ఏయిద్దరిముగ్గురికోతప్ప ఎవ్వళ్లకీ తనుఫలానాఅని తెలియనీలేదు. ఆడమేష్టర్లకసలే తెలీదు. ఏదో ఊళ్లో పిల్లఅనుకున్నారు అందరూను. నన్నడిగినట్టే ఏపంతులమ్మనో తెలుగుచెప్పేఆవిడనుగాబోలు ఏదోఅడిగిందట. ఆవిడఉడుక్కుని కోప్పడి స్కూలుకురావద్దందిట- నేనంటే ఊరుకున్నానుగాని ఆవిడకూడా అబ్బురమా తనంటే.

కాని ఓటి, ఎవరన్నా ఉపన్యాసాలిస్తూంటేనూ మీటింగులవుతూంటేనూమాత్రం పోవాలి అనదు. ఊరికే ఏమన్నాతమాషాలు చూద్దామనీ, ఎవళ్లనన్నా గమ్మత్తుకి ఆక్షేపిద్దామనీ ఉంటుంది.

"రేపుశనివారం. ఈఊళ్లో హోముఅని యేదోఉందట. నే చూద్దామనుకున్నాను. నీవూవస్తే బండీమీద పోవచ్చు."

"అవునుటండీ, అక్కడంతా పాపంతలచెడిన వాళ్లు ఉంటారుటగదూ వాళ్లఅన్నపూర్ణచెప్పింది."

"తలచెడినవాళ్లంటే మనవాళ్లలా ఉండరు. బాల్యంలో భర్తలు అకాలమరణం పొందినవారంతా వచ్చి చదువుకుంటారు అన్నమాట-"

"అబ్బో మీరెంత సంస్కృతంలోచెప్పినా అర్థం అన్నింటికీ ఒక్కటేలెండి-ఆఊళ్లో సంగీతంచెప్పే మంగలి ఎంతమేష్టరైనా మంగలాడనడంమానామా?. ఊరికే గొప్పలు."

"పోనీగాని మరి నీవువస్తావా? నన్నేవెళ్లమంటావా?"

"నీవు చదువుకోలేదుఅంటే నేనేంచెప్పలేనుగాని యింతవరకు మనంఏమీచూడలేదుగదా ముందుగానే వాళ్లనిచూడడం ఎందుకండీ. మరోమాటు వెళ్లగూడదూ? ఇంతలోకే వాళ్లేఊరన్నా లేచిపోతారా?"

"పోతే పోనూపోతారు. వాళ్లూచిన్నపిల్లలే. పెళ్లిళ్లుచేసుకుంటారు మనలాగేను."

"అవునులెండి. అది చెప్పక్కర్లేదు. అయితే అందరూఒక్కసారే పెళ్లిళ్లుచేసుకొని మేడలన్నీ ఖాళీచేస్తారా యేమిటి? మొట్టమొదటే అక్కడికిపోవడం నాకూబాగాలేదండి మీరుచాదస్తంఅనండి పెంకెదిఅనండి- మొన్నెగో కోటిలింగాలకు పోదామన్నారుగా సెలవొస్తే. మళ్లీయిల్లా తిరిగిందేమిటి యివ్వాళ."

"ఎక్కడికైనా పోవాలంటే ముందు అక్కడిచిత్రంఏమిటో తెలుసుకోంది అనవసరంగా బండికి డబ్బుతగలేయడ మెందుకు?."

"మరి మీచదువుల్లో ఎక్కడా కోటిలింగాల్లో ఏముంటుందో రాలేదూ?."

"రాకేంవచ్చింది. అక్కడ కోటియీశ్వరలింగాలుంటాయట. కాళహస్తిగుళ్లోకోటిస్తంభాలున్నట్లే."

"మరియికనేం? దేవుడిదర్శనంకంటే కావాలిసిందేమిటిగనక-అక్కడ గోదావరీ అదీ బాగుంటుందిట. అక్కడికేపోదాము-"

ఆసలు నేనూచూడలేదు కోటిలింగాలంటే ఏమిటో. నాకుమాత్రం ఏంతెలుసు? ఏమీ తెలీని చోటికి దీన్నెలా తీసుగెళ్లడం? తీరా అక్కడ కోతులూ కొండముచ్చులూఉంటే దీంతోకూడా నేనూభయపడిపరిగెత్తాలిసివస్తుంది. నాకేమోహోమూ అక్కడితోటా చూడాలనిఉంది. ఎల్లాగసాధనం- సరేఅని తీరాదాన్ని తీసుకువెళ్లకపోతేమరి జయించలేము. ఉపాయం ఆలోచించాలి రాత్రికి పడుకున్నాక-

రాజమండ్రీలో చచ్చినవాళ్లకు స్మారకసభలూ సమాజాలప్రార్థనసభలూ రోజుకు అథమంరెండేనా ఉంటవి. అన్నిసభలకూ ఆహోముబాలికలు రావడం మామూలు మొగవాళ్లుతీరికలేక రాకపోయినా వచ్చినా కూడా- శనివారంకూడా మీటింగువచ్చింది. ఎల్లాగూ ఆపిల్లలుండరు. తనకువాళ్లనిచూడ్డమూతప్పుతుంది. నాకదిచూడడమూ లభిస్తుంది. ఇక, లింగాలూ గోదావరీను. దీనికాపాటి సమాధానం చెప్పలేకపోతానా అనుకున్నాను.

మరునాడుసాయంత్రం నాలుగింటికల్లా కాఫీ అన్నీ తాగాము. తను మామూలుచీరే-ఉన్నవే అసలు పిచ్చిచీరెలు. అందులోనూ పిచ్చిదికట్టుకుంది. అంటే బండీలోవెళ్ళడమూ అక్కడఎవళ్లూ ఉండరాయె. ఉన్నా మమ్మల్ని ఎరిగినవాళ్లుఎవళ్లుంటారు గనక. అందులో ఆజాకెట్టు ఎక్కడోకాస్త చిరిగిందికూడాను. నాకెందుకు? నేనెందుకుచెప్పాలి. నాకై నేమంచివే కట్టుకున్నాను. మాటకు కోటిలింగాలు. వెడుతున్నది హోముదగ్గిరికి మొగాణ్ణిగనక 'బేరమాడాలని బండివాడిదగ్గిరకువచ్చి వాడితేమీ మాట్లాడవద్దనీ వీరేశలింగంగారితోటదగ్గిరికనీ ముందుచెప్పేశాను.

పోతున్నదిబండి. వంతెనమీదుగా దానవాయిగుంటా, చిన్నమైదానాలూ హోమూను-అక్కడదిగాము. ఎవళ్లూలేరు. నేనూ, ఇదీ, బండివాడూను. మమ్మల్నిచూచి ఎవళ్లోయిద్దరు బాలికలువచ్చివెళ్లారు. అక్కడిపూజారికూతుళ్లువాళ్లు అనిచెప్పాను-అన్నీ చూచింది. ఇళ్లూ, చెట్లూతప్ప ఏముంటాయి. నాకెంతోహాయిగాఉంది - అనాధబాలికలనిమిత్తం ఆసంస్కారి, మహాత్ముడు ఎంతప్రయాసపడ్డాడోగదా పాపం. దేశంరెండువంతులైనా ఆతండ్రి ఆదర్శాన్ని అనుసరిస్తే ఎంతబావుండును? ఆఎత్తైనగోడలూ, ఆవిశాలప్రదేశమూ, చల్లనిగాలీ ఎంతోప్రశాంతంగాఉండడం నాకో ఆనందాన్ని కలిగించినవి.

పక్కనదిక్కులు చూస్తూ తెల్లబోయినుంచుంది- లింగాలేవండీ యింకాఎక్కడేనా ఉన్నాయా అని అడిగిందితొందరగానూ, కోపంతోటీనూ-

“ఇవిగోనే,యీరాళ్లే-”అని అక్కడ కంకరరాళ్లు చూపెట్టాను. “కావాలిస్తే లెక్కెట్టుకోరాదూ?”

“అన్నీనట్టిదే, ఎక్కడికో తీసుకొచ్చి పాపం. ఇవి లింగాలెలాఅవుతవి-ఏపూజాలేదు బుగ్గిలేదు. ఎప్పుడూఇంతే-”అని ఏడుపుమొగం పెట్టింది.

“అదిగాదే మరిభద్రాచలంలో సీతామ్మవారి పసుపుకొమ్ములని రాళ్లుఏరుకురారూ, ఇవేంపసుపుకొమ్ములుఅని అన్నావా?-సీతామ్మవారు ఆరవేసుకున్నచీరెఅని ఓచిన్నకొండ చూపెడితే అక్కడ ఓకానీపడేసి నమస్కారం చేశాముగాని యిదేంచీరెఅని అడిగామా? అల్లాఅడగడంతప్పు, మహాపాపంఅని అంటారుగదూ. ఇక్కడాఅంతే-లింగాలంటే ఇవే. ఇవేంలింగాలని అనకూడదు. ఎంతదోషం. నీవు ఎరక్క-అన్నావుగనక అది పాపంలో చేరదులే-సరిగ్గా చూచేవాళ్ళులేక పూజాఅదీ రోజూజరగదు-లింగాల అమావాస్యఅని ఏడాదికో ఉత్సవంవస్తుంది. ఆనాడు ఇక్కడ ఎంతోబావుంటుంది- అప్పుడు పరమేశ్వరుడు పార్వతీదేవితోసహా గొప్పవారికీ మంచివారికీ దర్శనమిస్తాడట రహస్యంగా. మనం అప్పుడుకూడా వద్దాము-”

“మరి గోదావరేదమ్మా-”

“గోదావరితీసేసింది యివ్వేళ. ఈప్రాంతాల్లో గోదావరితల్లికి మహిమఅందుకనే-ఆమహాతల్లి దేవత కదూ! తనమాహాత్మ్యంచూపించి జనులకు భక్తిపుట్టించేందుకు తనయిష్టంవచ్చినప్పుడు మాయమౌతూంటుంది- ఒక్కొక్కప్పుడు నిండుగా ఎంతోలోతుగా ఉంటుంది. అప్పుడు చిన్నచిన్న పడవలమీద పోతారుజనం- ఆఉత్సవంలో అంతే- అంతమహిమగనకే ఎంతోమందిజనం రావడం, కోటిలింగాలని ప్రసిద్ధీను- అల్లాఅడిగి అన్నీతెలుసుకోవాలిగాని ఏదోఅనుకొని మూతిబిగించుకోవడం కూడదు-”

పాపం కొంతసమాధానపడ్డది-ఆపిల్లలు జడా,చీరే, బొట్టూకట్టుకొని చక్కగా మనపిల్లలానేఉన్నారు- తనువాళ్లతో మాట్లాడుతుందేమో మరీగోలఅనివాళ్లు మనదేశపువాళ్లుకారనీ హీబ్రూదేశపువారనీ, ఆదేశం ఎంతోదూరమనీ, మనభాషరాదనీ చెప్పాను-ఊరుకుంది. గావాళ్లని చూచింది-

అయితే యిక్కడివాళ్లలా జడాచీరే కట్టుకున్నారుగదా మరి తెలుగుగూడా ఎందుకునేర్చుకోలేదు అని అడిగింది. ఏమోనాకూతెలీదని పొద్దూక్కముందే మళ్లావాళ్లంతతావస్తే యికతప్పకుండా హోమేఅనుకుంటుందని బండిఎక్కించి తొందరపెట్టి యిల్లుచేరాము. కాని అది కోటిలింగాలుకాదనిమాత్రం తెలుసుకుంది గోదావరి లేకపోవడంమూలాన్ని. బండీలో నాతోఏంమాట్లాడలే. ఇంటికివచ్చాక అన్నంతినేప్పుడు “నేను ఇంక మీతోఎక్కడికీరాను. వాళ్లఅన్నపూర్ణా నేనూ వెడతాము. అస్తమానం ఓదానికోటి చూపడమేగాని- పాపం- అసలుఎందుకు రమ్మనాలి అంత యిష్టంలేకపోతే నన్ను”అని అంది గమ్మత్తుగా మొగంపెట్టి.